జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 13 | మే | 2026 ◆ పేజీలు : 9


## ఉద్దీపకం వర్క్‌బుక్ తయారీకి ప్రణాళికలు రూపొందించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ వెల్లడి



**భద్రాచలం టౌన్, మే 12 ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివే చిన్నారులకు విద్యాభ్యాసం ప్రాథమిక స్థాయిలో పునాది బలోపేతం కావడానికి ప్రవేశపెట్టిన ఉద్దీపకం వర్క్ బుక్ సత్ఫలితాలను ఇవ్వడంతో ఈ సంవత్సరం కొద్దిగా మార్పులు చేర్పులతో ఉద్దీపకం వర్క్ బుక్ తయారీకి ప్రణాళికలు రూపొందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత

మిగతా 2 లో...




- ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తలెత్తితే పూర్తి బాధ్యత కలెక్టర్లదే
- గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచాలి
- వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 12,(ప్రజాజ్యోతి)** రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీలు

మిగతా 2 లో...



## ప్రజాసేవలో తుమ్మల చెరగని ముద్ర

- కమ్మసత్రంలో తుమ్మల 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై ఆత్మీయ సభ
- తుమ్మల సేవలను కొనియాడిన రాజకీయ ప్రముఖులు
- ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి తుమ్మలే చిరునామా : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 12 ( ప్రజాజ్యోతి )** ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి చరిత్రలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాత్రను ఎవరూ మరువలేరని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం పరిధిలోని కమ్మ సత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన ఆత్మీయ సభ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని

మిగతా 2 లో...

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కొరడా

- ఇసుక మాఫియాపై లక్ష్మీదేవిపల్లి పోలీసుల ప్రత్యేక నిఘా
- ముర్రేడు వాగులో ఇసుక మాఫియాకు చెక్.. ట్రెంచ్‌తో రవాణా అడ్డుకట్ట
- అక్రమ ఇసుక రవాణాపై ఎస్ఐ – ఎమ్మార్వో సంయుక్త హెచ్చరికలు
- ప్రజలు సమాచారం అందించాలని అధికారుల విజ్ఞప్తి



**లక్ష్మీదేవిపల్లి, మే 12 (ప్రజాజ్యోతి)** లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండలంలోని సాటివారిగూడెం గ్రామ పరిధిలోని ముర్రేడు వాగు నుంచి పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం అందడంతో లక్ష్మీదేవిపల్లి పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమై సంయుక్తంగా

మిగతా 2 లో...

## అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే జారే
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృత పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం – కొత్త పల్లె వెలుగు బస్సు ప్రారంభం

2 లో...



# ఉద్దీపకం వర్క్‌బుక్ తయారీకి ప్రణాళికలు రూపొందించాలి

(మొదటి పేజీ తరువాయి...)

ఎస్సిఆర్‌పిలు, ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఎస్సిఆర్‌పిలు, ఉపాధ్యాయులతో ఉద్దీపకం వర్క్ బుక్ తయారీకి ప్రణాళికలు రూపొందించడానికి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉద్దీపకం వర్క్ బుక్ లో మార్పులు, చేర్పులు చేసి మూడో తరగతి పిల్లలకు వర్క్ బుక్ నిర్వహణ నిరంతరం చేస్తూ ఉండాలని అన్నారు. ఇంగ్లీష్ వర్క్ బుక్ లో కొద్దిగా స్టాండర్డ్ పెంచి పిల్లలకు అర్థమయ్యే రీతిలో సైంటిస్ట్, మహనీయులు, సైన్స్ అలాగే ప్రపంచానికి సంబంధించిన అంశాల వివరాలు పొందుపరిచి పిల్లలు చదవడం రాయడంతో పాటు సులభంగా అర్థం చేసుకుని మేధాశక్తిని పెంపొందించుకునేలా సంబంధిత ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఆగస్టు 31 వరకు ఉద్దీపకం వర్క్ బుక్ పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత జూన్ 20వ తారీకు నాడు పిల్లలందరకు అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇంగ్లీష్ వర్క్ బుక్ లోని అంశాలు చిత్రాల ఆధారంగా మాత్రమే ఉండాలని, తెలుగు వర్క్ బుక్ లోని అంశాలు చాలా వరకు మార్పులు చేర్పులు చేయాలని అన్నారు. అలాగే ఏడవ తరగతి ఎనిమిదో తరగతి చదువుతున్న పిల్లలకు పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని అర్థమయ్యే రీతిలో ప్రత్యేకంగా లెక్కలు మరియు ఇంగ్లీషులో వర్క్ బుక్ తయారుచేసి వారానికి రెండుసార్లు ప్రత్యేక తరగతులు నిర్వహించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన జరిగేలా ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. జిపిఎస్ పాఠశాల చిన్నారులతో పాటు ప్రైమరీ స్కూల్లో చదువుతున్న పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని విద్యాభ్యాసం మెరుగుపరుచుకునేల సంబంధిత ఉపాధ్యాయులు, ఎస్ సి ఆర్ పి లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఏ సి ఎం ఓ రమేష్, ఎస్ సి ఆర్ పి లు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కొరడా



(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి చాతకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని స్మశానవాటిక సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా అక్కడ అక్రమంగా డంప్ చేసి నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించారు. అక్రమ నిల్వ ఇసుకను స్వాధీనం చేసుకొని రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించారు. అక్రమ ఇసుక రవాణా వెనుక ఉన్న వారిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి రెవెన్యూ సిబ్బందితో కలిసి ముర్రేడు వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. వాగు నుంచి ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా ఇసుక తరలిస్తున్న మార్గాలను గుర్తించి జేసీబీ సహాయంతో ట్రెంచ్ తవ్వించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమణారెడ్డి మాట్లాడు తూ మండల పరిధిలో ఎక్కడైనా అక్రమ ఇసుక తవ్వకాలు, అనుమతి లేని ఇసుక రవాణా చేపట్టిన , నిల్వలు జరిగినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలుగుతోందని సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తరలింపులు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. పోలీసు శాఖతో పాటు రెవెన్యూ యంత్రాంగం సంయుక్తంగా మండలవ్యాప్తంగా పర్యవేక్షణ కొనసాగిస్తోందన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు హామీ ఇచ్చారు. అక్రమ ఇసుక రవాణా అరికట్టడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎమ్మార్వో శిరీష తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంయుక్త బృందాలతో దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మండలంలో ఇసుక మాఫియాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి...)

తూకం యంత్రాలు తదితర అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని, రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఒప్పందం మేరకు వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు, గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్ తదితర భవనాలను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు, అవసరమైన చోట పోలీస్ శాఖ సహకారంతో కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎక్కడైనా సమస్యలు తలెత్తినా పూర్తి బాధ్యత సంబంధిత జిల్లా కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొనుగోళ్ల పురోగతిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలని ఆదేశించారు. ఐడిఓసి కార్యాలయంలో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా ఇకముందు ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారులను నియమించి తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కి తెలిపారు . గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా వాహనాలు సమృద్ధిగా



అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించేలా ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరిస్తున్నామన్నారు, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతున్నామని, అవసరమైన చోట తాత్కాలిక నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ధాన్యం, మొక్కజొన్న సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తామన్నారు . ఈ వీడియో కాన్ఫరెన్స్ కు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో తుమ్మల చెరగని ముద్ర

(మొదటి పేజీ తరువాయి...)

సాంబశివరావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్రాభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సేవలు అపారమన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లోనూ అవినీతి రహిత నాయకుడిగా తుమ్మల ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేసే నేత కాదని గెలిచిన తర్వాత కూడా అన్ని పార్టీల ప్రజాప్రతినిధులకు సమానంగా సహకరిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇచ్చే నాయకుడు తుమ్మల అని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన రెండు సందర్భాల్లోనూ తుమ్మల సహకారం మరువలేనిదని కూనంనేని స్పష్టం చేశారు. వామపక్షాలతో పొత్తు ధర్మాన్ని గౌరవించిన నాయకుడు తుమ్మల అని అభినందించారు. నాలుగురు ముఖ్యమంత్రుల వద్ద కీలక బాధ్యతలు నిర్వహించిన అరుదైన నాయకుడిగా తుమ్మల నిలిచారని పేర్కొన్నారు. ఆయన మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

### »» అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ తుమ్మల

సభలో పలువురు రాజకీయ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు బ్రాండ్ అంబాసిడర్‌లా నిలిచారని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసి గిరిజన ప్రాంతాల తలరాత



మార్చిన నాయకుడు తుమ్మల అని అభివర్ణించారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారుల విస్తరణ, పామాయిల్ సాగు ప్రోత్సాహం వంటి అనేక రంగాల్లో ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయాల్లో అడుగుపెట్టి క్రమశిక్షణతో ప్రజా సేవను కొనసాగించిన గాంధేయవాది తుమ్మల అని ప్రశంసించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకుల అభిమానాన్ని సంపాదించిన అజాత శత్రువుగా ఆయన ఎదిగారని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక కాలం మంత్రిగా సేవలందించిన అరుదైన నాయకుడిగా తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. కె సాబీర్ పాషా, బిక్కసాని నాగేశ్వరరావు, నాగ సీతారాములు, మోత్కూరి ధర్మారావు, గడిపెల్లి కవిత, యెర్రా కామేష్, విద్యాసంస్థల అధినేతలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే జారే
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృత పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం – కొత్త పల్లె వెలుగు బస్సు ప్రారంభం



**ములకలపల్లి, మే 12, ప్రజాజ్యోతి:** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం ములకలపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సత్తుపల్లి నుంచి ములకలపల్లి, చౌటిగూడెం, పొగళ్లపల్లి, తిమ్మంపేట మీదుగా భద్రాచలం వరకు నూతన పల్లె వెలుగు బస్సు సేవను ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా బస్సులో తిమ్మంపేట వరకు ప్రయాణించి ప్రయాణికులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, ఉద్యోగ అవసరాల కోసం రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మార్గమధ్యంలోని గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చౌటిగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, మహిళా సంఘాల కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. ఒడ్డుగూడెంలో ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని ప్రారంభించారు. పొగళ్లపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అదే గ్రామంలో సీసీ రోడ్లు, పాఠశాల ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపనలు చేశారు. ములకలపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం రెండు కమ్యూనిటీ భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' సమీక్ష సమావేశంలో పాల్గొని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు కోర్స చంద్రకళ, మడకం రవి, కుంజా వినోద్, ఎంపీడీవో రామారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల అంజి, తాండ్ర ప్రభాకరరావు, కారం సుధీర్, నాగళ్ళ వెంకటేశ్వరరావు, గాడి తిరుపతిరెడ్డి, అనుమాల సత్యనారాయణ, కరుటూరు కృష్ణ, సురభి రాజేష్ మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం







- **స్వామి వారిని దర్శిం చుకున్న ఏపీలోని గన్నవరం ఎమ్మెల్యే**

**భద్రాచలం టౌన్, మే 12 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే స్వామి వారిని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వెంకటేశ్వరరావుకు వేద ఆశీర్వచనం అందజేసి దేవస్థానం తరపున తీర్థప్రసాదాలను ఆలయ ఈవో కె.దామోదర్‌రావు అందజేశారు.

## పోగొట్టుకున్న 15 తులాల బంగారం, నగదు బ్యాగు ప్రయాణికురాలికి అందజేత




**భద్రాచలం టౌన్, మే 12 ప్రజాజ్యోతి** భద్రాచలంలో మంగళవారం ఓ ప్రయాణికురాలు బస్సులో పోగొట్టుకున్న సుమారు 15 తులాల బంగారం, నగదు ఉన్న బ్యాగును బాధితురాలికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు భద్రాచలం డిపో డ్రైవర్ ఎం.ఎస్. ఖాన్. విశాఖపట్నం నుంచి భద్రాచలం వస్తున్న లహరి (నాన్ ఏసీ) బస్సులో ఒక మహిళా ప్రయాణికురాలు ప్రయాణించారు. ఉదయం 5 గంటల సమయంలో ఆమె జగన్నాథపురం వద్ద దిగిపోయారు. అయితే బస్సులో తన బెర్త్ వద్దే బ్యాగును మరిచిపోయారు. ఇంటికి వెళ్ళిన తర్వాత బ్యాగ్ లేని విషయాన్ని గమనించిన బాధితురాలు కంగారుపడుతూ వెంటనే డ్రైవర్ కు ఫోన్ చేశారు. దీంతో డ్రైవరు ఖాన్ ఆమె ఇచ్చిన సమాచారం ఆధారంగా బ్యాగ్‌ను గుర్తించారు. అనంతరం బాధితురాలు డిపోకు చేరుకోగా, డ్రైవర్ ఆమె టికెట్ వివరాలను పరిశీలించారు. బ్యాగులో ఏమున్నాయని ఆరా తీయగా..అందులో సుమారు 15 తులాల బంగారం, రూ. 4,000 నగదు, రూ. 20,000 విలువైన ఐప్యాడ్ ఉన్నట్లు ఆమె తెలిపారు. దీంతో బ్యాగును డ్రైవరు ఖాన్, డ్యూటీ కానిస్టేబుల్ డీఎన్ కుమార్, డీకేపీ రాజు, కంట్రోలవర్ బి.భాను ప్రసాద్ సమక్షంలో అందజేశారు.

## రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యం వద్దు

- **చర్ల తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**
- **ప్రజలకు పారదర్శక సేవలు అందించాలి**
- **సకాలంలో ధృవపత్రాలు జారీ చేయాలని అధికారులకు ఆదేశం**



**చర్ల, మే 12(ప్రజా జ్యోతి ):** ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తారని అలాంటి వారికి కార్యాలయ సిబ్బంది సకాలంలో స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అధికారులను ఆదేశించారు.మంగళవారం చర్ల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, ఫైల్స్ నిర్వహణ, రికార్డుల భద్రత, దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యాలయానికి సంబంధించిన ముఖ్యమైన ఫైల్స్, రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని ప్రజల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిశీలించాలని సూచించారు.కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వారి సమస్యలను ఓపికగా విని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా భూములకు సంబంధించిన వివాదాలు, రెవెన్యూ పట్టాల సమస్యలు, విద్యార్థులకు అవసరమైన కులం, ఆదాయం, నివాస ధృవపత్రాల జారీ విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు.విద్యార్థులు విద్యా అవసరాల కోసం ధృవపత్రాలపై ఎక్కువగా ఆధారపడుతుంటారని అందువల్ల వారికి సకాలంలో సర్టిఫికెట్లు అందేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా గిరిజన రైతులకు సంబంధించిన భూ సమస్యలు, పాస్‌బుక్స్, ఇతర రెవెన్యూ సమస్యలను కూడా ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్యాలయానికి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో సబ్ కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను స్పష్టంగా లిఖితపూర్వకంగా సమర్పించాలని, ఏదైనా పనిలో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రానున్న 15 రోజులు మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకం

- **జిల్లా కలెక్టర్ అంకిత్**




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 12,(ప్రజా జ్యోతి)** రానున్న 15 రోజులు మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అం కిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో మొక్కజొన్న నిల్వలు, లోడింగ్ పరిస్థితులు, గోడౌన్ల అందుబాటు, రవాణా స దుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇల్లందు నియోజకవర్గ పరిధిలో సుమారు 9,300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలు ఉన్నాయని, లోడింగ్‌లో జాప్యం ఎందుకు జరుగుతోందనే అంశంపై కారణాలను అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు.గోడౌన్ల అందుబాటు కోసం బయ్యారం, ములకలపల్లి, కృష్ణసాగర్, దుమ్ముగూడెం, వాజే డు, వెంకటాపురం, కొత్తగూడెం, బంగారుచిలక ప్రాంతాల్లో నిల్వ సదుపాయాలు అం దుబాటులో ఉన్నందున త్వరితగతిన లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో ఇల్లందు ప్రాంతంలోని మొక్కజొన్నను గోడౌన్ల కు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.మార్క్‌ఫెడ్, రవాణా, మా ర్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు, రవాణా ప్రక్రియ ను పూర్తి చేయాలని ఆదేశించారు. రవాణా విషయంలో లోడింగ్ కాంట్రాక్టర్లు అ లసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు న మోదు చేయాలని సూచించారు. అవసరమైతే మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో పోలీస్ శాఖ సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు.హమాలీలు తగిన సం ఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కడైనా గోడౌన్ సమస్య తలెత్తితే తా త్కాలికంగా ఫంక్షన్ హాళ్లు, పాఠశాల భవనాలు ఇతర అనుకూల భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి, ఆయా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలనలు చేపట్టాలని ఆదేశించారు.ప్రతిరోజూ కొనుగోలు వివరాలను నిరంతరం నివేదికల రూపంలో అందించాలని, కొనుగోలు పూర్తైన వెంటనే 24 గంటల్లో ట్యాబ్ ఎంట్రీ లు పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్, డీసీఎస్‌వో, డీటీవో, డీఎం సివిల్ సప్లై తదితర అధికారులు ప్రతిరోజూ కొనుగోలు, లోడింగ్, అన్‌లోడింగ్, గోడౌన్ల పరిస్థితి, హమాలీల అందుబాటు, గ న్నీ బ్యాగుల సరఫరా వంటి అంశాలను పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాతావరణ శాఖ హెచ్చరికల ను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండి మొక్కజొన్న కొనుగోలు ప్ర క్రియను వేగవంతంగా పూర్తి చేసే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## బండి సంజయ్ తనయుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

- **కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్ ను తొలగించాలి**
- **ఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రటరీ కొప్పుల రవీందర్ డిమాండ్**




**భద్రాచలం, మే 12 , ప్రజాజ్యోతి** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ని వెంటనే అరెస్ట్ చేయాలని, నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రటరీ కొప్పుల రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం భద్రాచలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తండ్రి అధికార అండతో సాయి భగీరథ విద్యాసంస్థల్లో ర్యాగింగ్, భౌతిక దాడులు, మద్యం మత్తులో విద్యార్థులపై అరాచకాలకు పాల్పడుతున్నారని రవీందర్ ఆరోపించారు. ఇటీవల ఒక మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా, సదరు బాలికే తమను 'హనీ ట్రాప్' చేసిందంటూ తప్పుడు ప్రచారం చేస్తూ కేసును తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. బాధితురాలికి మద్యం తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారని, దీనివల్ల తన భవిష్యత్తు నాశనమైందని బాధిత యువతి ఆవేదన వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు.ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న పోలీసుల తీరుపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని ఆయన కోరారు. పోలీసులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలే తప్ప, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని హితవు పలికారు. బాధిత కుటుంబాన్ని బెదిరిస్తున్నట్లు సమాచారం అందుతోందని, సదరు బాలికకు ప్రాణహాని పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఆందోళన తప్పదు చట్టం ముందు అందరూ సమానమేనని, సాయి భగీరథను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని రవీందర్ డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబంపై తప్పుడు కేసులు పెట్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ను వెంటనే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, కిషోర్, సాయికుమార్, హేమంత్, కిరణ్ కుమార్, నరసింహ, వివేక్ వర్ధన్, సూర్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాల కార్యక్రమం



**చర్ల, మే 12(ప్రజా జ్యోతి):** చర్ల మండలం చర్ల ప్రభుత్వ పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం విద్యా వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారికి భవిష్యత్ విద్యా ప్రణాళికలు చదువుపై దృష్టి పెట్టే విధానాలు మానసిక ధైర్యం పెంపొందించే అంశాలపై మార్గదర్శకాలు అందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు మాట్లాడుతూ విద్యార్థుల నడవడిక మానసిక పరిస్థితులు చదువుకునే విధానాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని సూచించారు. విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, ఉదయం రాగి జావ, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా మంజూరు చేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ఉచిత విద్యను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరంనుంచి విద్యార్థులకు ప్రత్యేక స్కూల్ కిట్లు కూడా అందించనున్నట్లు తెలిపారు. ఆ కిట్లలో విద్యార్థులకు అవసరమైన అన్ని విద్యా సామగ్రి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా నర్సుల దినోత్సవం

- గ్రామీణ ఆరోగ్య రక్షణలో నర్సుల సేవలు అమూల్యం
- నర్సులు ఆరోగ్య శాఖకు వెన్నెముకలంటూ వైద్యుల ప్రశంస



**చర్ల, మే 12(ప్రజా జ్యోతి):** అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ హారిక ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నర్సులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఆరోగ్య శాఖలో నర్సులు కీలక స్తంభాల వంటివారని నర్సులు లేకుండా ఆరోగ్య శాఖ వ్యవస్థ సమర్థంగా కొనసాగడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రేమ, ఆప్యాయత, సహనం, సేవాభావానికి నర్సులే ప్రతీకలని తెలిపారు. రోగుల సేవలో వారు అందిస్తున్న సేవలు ఎన్నటికీ మరువలేనివని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఒక అక్కలా బాధ్యతలు నిర్వర్తిస్తూ నర్సులు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో విశేష పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా గ్రామాల్లో వ్యాధుల నియంత్రణ, గర్భిణీల సంరక్షణ, చిన్నారులకు టీకాలు, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో సిస్టర్స్ సేవలు అమూల్యమని వైద్యులు అభినందించారు.సీనియర్ సిస్టర్ లక్ష్మీ మాట్లాడుతూ, నర్స్‌గా పనిచేసే అవకాశం దక్కడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. బాధలో ఉన్న రోగులకు సేవ చేయడం వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని చెప్పారు. అమ్మా మీ వల్లే నేను బతికాను అని రోగులు చెప్పినప్పుడు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిదని భావోద్వేగంగా పేర్కొన్నారు.ప్రతి గర్భిణీ మహిళ, చిన్నారికి టీకాలు సకాలంలో అందేలా చూడడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం నర్సులు అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, ఫార్మాసిస్ట్ నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, నర్సింగ్ ఆఫీసర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తులసి, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు



**భద్రాచలం, మే 12, ప్రజా జ్యోతి:** భారత ఎన్నికల సంఘం దాదాపు 23 సంవత్సరాల అనంతరం ఈ ఏడాది ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను చేపట్టిందని, దీనిని దేశవ్యాప్తంగా దశల వారీగా నిర్వహిస్తున్నట్లు 119-భద్రాచలం (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.చివరిసారిగా 2002 సంవత్సరంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని, అప్పటి ఓటర్ల వివరాలను ప్రస్తుత 2025 ఓటర్ల జాబితాతో సరిపోల్చుతూ ప్రత్యేక మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభం కానుందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉచిత మ్యాపింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న ట్లు తెలిపారు.భద్రాచలం మండల ప్ర జల సౌకర్యార్థం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సహాయ కేంద్రం ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, ఆదివారంతో సహా, ప్రతిరోజూ ఉద యం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.కావున భద్రాచలం మండలంలోని ఓట ర్లు తమ ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు తదితర అవసరమైన పత్రాలతో సహాయ కేంద్రాన్ని సందర్శించి, కు టుంబ సభ్యుల ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. మండలంలోని ఓటర్లందరూ సద్వినియోగం చేసు కోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- జై హనుమాన్ నినాదాలతో బైక్ ర్యాలీ



**చర్ల, మే 12 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామి వారి దేవాలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు .ఈ సందర్భగా హనుమాన్ భక్తులు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో యువత, హనుమాన్ భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని చాటుకున్నారు.ఈ ర్యాలీ పాత చర్ల శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రారంభమై చర్ల లోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న భక్తులు "జై హనుమాన్", "జై శ్రీరామ్" అంటూ నినాదాలు చేస్తూ పట్టణమంతా భక్తిమయ వాతావరణాన్ని నెలకొల్పారు.యువత బైక్‌లపై కాషాయ జెండాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. పలువురు భక్తులు హనుమాన్ చిత్రపటాలు, కాషాయ పతాకాలతో ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ర్యాలీ మార్గమంతా స్థానిక ప్రజలు భక్తులకు అభివాదం తెలియజేశారు. మహిళలు, చిన్నారులు కూడా రోడ్ల పక్కన నిలబడి ర్యాలీని వీక్షించారు.హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, హారతులు నిర్వహించారు.

## గిరిజన యువతకు స్వయం ఉపాధి శిక్షణ

- ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం
- ఎంపీడీఓ ఈదయ్య



**చర్ల, మే 12 (ప్రజా జ్యోతి):** సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఐ టి డీ ఏ భద్రాచలం ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో గల గిరిజన నిరుద్యోగ యువతి యువకులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చర్ల మండల ఎంపీడీఓ ఈదయ్య తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమాలు 3 నుండి 4 నెలల పాటు కొనసాగనున్నాయని, ఆసక్తి గల గిరిజన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**శిక్షణ కోర్సుల వివరాలు:** బ్యూటీ థెరపిస్ట్,బ్రైడల్ ఫ్యాషన్ అండ్ ఫోటో మేకప్ ఆర్టిస్ట్,హ్యాండ్ ఎంబ్రాయిడరీ,సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్,డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్,కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ ,జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్,శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్ కూడా అందజేయనున్నట్లు తెలిపారు.అభ్యర్థుల విద్యార్హతలు 8వ తరగతి, 10వ తరగతి, ఇంటర్ లేదా డిగ్రీ, వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యా సర్టిఫికెట్లతో 15-05-2026 తేదీన చర్ల మండల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం 9347466615, 9447390232 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని ప్రకటనలో తెలిపారు.

## రూ.20 లక్షల భీమా చెక్కు అందజేత




**బూర్గంపహాడ్,మే12 (ప్రజా జ్యోతి):** మండలంలోని బుడ్డగూడెం గ్రామానికి చెందిన సోడె నరేష్ ఇటీవల మరణించడంతో బూర్గంపహాడ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) కింద రూ.20 లక్షలు మంజూరైంది. ఈ మేరకు స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో రీజనల్ మేనేజర్ నాగరాజు ఇతర బ్యాంక్ అధికారుల చేతుల మీదుగా రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును నామినీగా ఉన్న మృతుని తండ్రి సోడె గోపయ్యకి మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్య, జీవిత బీమా చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ సర్పంచ్ నాగరాజు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బూర్గంపహాడ్ శాఖ మేనేజర్ ప్రసాద్, ఖాతాదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యోగాతోనే విద్యార్థుల మానసిక ఉల్లాసం

- భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్

**భద్రాచలం టౌన్, మే 12, ప్రజాజ్యోతి** విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా, మెడిటేషన్ వంటి ప్రక్రియలు చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మంగళవారం కళాశాల సమావేశ మందిరంలో రెండో రోజు విద్యార్థులకు యోగా, ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారని, శారీరక, మానసిక దృఢత్వానికి యోగా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య సూత్రాలను విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని ఆయన ప్రబోధించారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం...** కళాశాల యోగా ఇన్స్ట్రక్టర్ డాక్టర్ నాగ సమీర మాట్లాడుతూ.. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న సూక్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. మంచి ఆరోగ్యంతోనే సృజనాత్మక ఆలోచనలు వస్తాయని, అప్పుడే దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం సాధ్యమవుతుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి పలు యోగాసనాలు వేయించి, ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





# మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

- 1.01 కోట్ల నగదు, భారీగా ఆయుధాలు స్వాధీనం








**చర్ల , మే 12:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో నక్సల్ నిర్మూలన దిశగా నారాయణ్‌పూర్ పోలీసులు నిర్వహిస్తున్న "మర్ద్ బచావో అభియాన్"లో భద్రతా బలగాలు భారీ విజయాన్ని సాధించాయి. పోలీసులు, డిఆర్జీ, సీఆర్పీఎఫ్, ఐటిబీపీ, బీఎస్ఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో భారీ మొత్తంలో నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు నక్సల్స్ వినియోగించే ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా నారాయణ్‌పూర్ పోలీసు సూపరింటెండెంట్ రాబిన్సన్ గుడియా మాట్లాడుతూ గ్రామస్తుల సహకారం బలమైన నిఘా వ్యవస్థ కారణంగానే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అందించిన సమాచారంతో అబుజ్‌మాడ్ అటవీ ప్రాంతం, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గత నెల రోజులుగా విస్తృత గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.సంయుక్త ఆపరేషన్‌లో మొత్తం రూ.1 కోటి 1 లక్ష 64 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా 28 రకాల నక్సల్ సంబంధిత వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్ నక్సల్స్ లాజిస్టిక్స్ వ్యవస్థ, ఆయుధాల సరఫరా ఐఈడీ తయారీ సామర్థ్యాలకు గట్టి దెబ్బతీసిందన్నారు.స్వాధీనం చేసుకున్న ఆయుధాల్లో 3 ఏకే-47 రైఫిళ్లు, 3 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 2 .303 రైఫిళ్లు, ఒక .315 రైఫిల్, 2 దేశీ కట్టాలు, 2 పన్నెండు బోర్ గన్స్, ఒక ఎయిర్ గన్ ఉన్నాయి. అలాగే భారీ సంఖ్యలో లైవ్ కార్ట్రిడ్జ్‌లు, మ్యాగజైన్‌లు, బీజీఎల్ సెల్స్, బీజీఎల్ కార్ట్రిడ్జ్‌లు, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్లు, మోటరోలా సెట్లు, వాకీటాకీలు, పేలుడు పదార్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నక్సల్ యూనిఫాంలు ఇతర సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. 2025-26 సంవత్సరంలో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 270 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ గణాంకాలు జిల్లాలో శాంతి, భద్రత మరియు అభివృద్ధి ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతున్నాయని సూచిస్తున్నాయని పేర్కొన్నారు. 2026 మార్చి 31 నాటికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని పూర్తిగా నక్సల్ రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక ఆపరేషను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.నక్సల్స్ అబుజ్‌మాడ్ అటవీ ప్రాంతాల్లో మరిన్ని ఆయుధాలు, పేలుడు పదార్థాలు దాచిపెట్టే అవకాశం ఉందని గ్రామస్తులు అనుమానాస్పద వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని భద్రతా బలగాలు విజ్ఞప్తి చేశాయి.

## అక్రమ పశు రవాణా చట్టరీత్యా నేరం

- బక్రీద్ వరకు పశు రవాణా నిషేధం- సిఐ రాజు వర్మ




**చర్ల, మే 12 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ఎవరైనా పశువులను అక్రమంగా రవాణా చేస్తే సహించేది లేదని అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని చర్ల సీఐ ఏ. రాజు వర్మ హెచ్చరించారు.మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పశుసంవర్ధక శాఖ అధికారులు, మేజర్ గ్రామపంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు, పశువుల వ్యాపారులతో కలిసి పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రాజు వర్మ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు వచ్చే బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలో ఎక్కడి నుంచైనా పశువులను అక్రమంగా తరలించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. బక్రీద్ పండుగ పూర్తయ్యే వరకు పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు.పండుగ అనంతరం కూడా పశువుల వేలంపాట నిబంధనలు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ సరైన పత్రాలు అనుమతులతోనే పశువుల రవాణా నిర్వహించాలని సూచించారు. పశువుల కొనుగోలు విక్రయాల్లో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందన్నారు.అక్రమ రవాణా చట్టవిరుద్ధమైన పశు వ్యాపారాలపై పశుసంవర్ధక శాఖ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.అదేవిధంగా అక్రమ రవాణాను అడ్డుకునే పేరుతో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని అలాంటి చర్యలకు పాల్పడిన వారిపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎస్సెలు ఆర్. నర్సిరెడ్డి, పి. కేశవ్, మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి తోకల సురేష్, సర్పంచ్ పూజారి సామ్రా జ్యం, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ కే సుధారాణి, అసిస్టెంట్ హరికాంత్, పలువురు పశువుల వ్యాపారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నేతలపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

- -వార్డు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

**ఇల్లందు మే 12, ప్రజాజ్యోతి:** మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేతలపై అసత్య ఆరోపణలు మానుకోవాలని, వార్డు కౌన్సిలర్ గా వార్డు సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి లు సూచించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 13వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన దండు సారయ్యకు రాజకీయ అనుభవం లేదని ఇప్పుడే ఓనమాలు నేర్చుకుంటున్నాడని తెలిపారు. రాజకీయ అనుభవం లేని సారయ్య కో ఆప్షన్ సభ్యుడైన మడుగు సాంబమూర్తి, అతని కుటుంబసభ్యులపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముందుగా ప్రజా ప్రతినిధికి ఎలాంటి నియమ నిబంధనలు విధివిధానాలు ఏ పనులు చేయించాలో నేర్చుకోవాలన్నారు. సాంబమూర్తి కుటుంబ సభ్యులు ఎవరైనా సారయ్య పట్ల గాని వారి అనుచరుల పట్ల గాని తప్పుగా వ్యవహరించిన అక్కడ మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న వారి కుటుంబ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన ఆయన లిఖితపూర్వకంగా మున్సిపల్ అధికారులకు చైర్మన్ కి ఫిర్యాదు చేయవచ్చని, అలాకాకుండా తన ప్రతిష్టను పెంచుకునేందుకు తమ పార్టీ, నేతలపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. గెలుపోవటంలే ఎన్నికల వరకేనని తర్వాత ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు పోతుందని ఎవరి పట్ల వివక్షత చూపించే నైజం కాంగ్రెస్ పార్టీకి గాని స్థానిక ఎమ్మెల్యే గాని లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే మున్సిపల్ అధికారులు, చైర్మన్, ఎమ్మెల్యే తో పని చేయించుకొని వార్డు ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని హితవుపలికారు. వార్డు ప్రజలు సంవత్సర పరిష్కారం కోసం కౌన్సిలర్ వద్దకు వెళ్లడం లేదని, కోఆప్షన్ సభ్యుడైన మడుగు సాంబమూర్తి వద్దకే వస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, కౌన్సిలర్లు కొర్లపాటి శివ కిరణ్, ఆజ్మీరా వంశీ, మెరుగు కార్తీక్ కార్తీక్, నీలపు రమేష్, నీరుడు ఉపేంద్ర, గొపగాని రాజు, రంప రమ్య, కో ఆప్షన్ సభ్యురాలు హసిన, నాయకులు ఈశ్వర్, గందే సదానందం, కమల్ కోరి, జాన్సన్, మడుగు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌ను అరెస్టు చేయాలి



**బూర్గంపహాడ్,మే12 (ప్రజా జ్యోతి ):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సారపాక ప్రధాన కూడలి నందు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన తన కుమారుడిని రక్షించేందుకు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగేంతవరకూ బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సారపాక టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీను,తాళ్ళ గొమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి,నాయకులు బెజ్జంకి కనకాచారి, కె.వి రమణ, చైతన్య రెడ్డి, పూర్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జలబిందెల , ఓమ కార్యక్రమం



**గుండాల. మార్చి 12. ప్రజా జ్యోతి** గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కంత మహేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఘనంగా జలబిందెల కార్యక్రమాన్ని యహోవా కార్యక్రమాన్ని నిర్వహించారు, మంగళవారం ఉదయాన్నే ముత్యాలమ్మ గుడి వద్దకు గౌడ పురుషులందరూ జల బిందెలతో మహిళలు మంగళ హారతి తో చేరుకొని గుండాల సెంటర్ నుండి కంతమహేశ్వర స్వామి గుడి వద్దకు చేరుకున్నారు గౌడ కులస్తులు కాషాయ రంగుతో దుస్తులు ధరించి అందరూ ఒకేసారి పోవడంతో గుండాల మండల కేంద్రంలో పండగ వాతావరణాన్ని తలపించింది, ముత్యాలమ్మ గుడి నుండి కట్ట మహేశ్వర స్వామి గుడి వద్దకు ఊరేగింపుగా వెళ్లి విగ్రహాలకు జలాధి వాసం చేశారు గుడి వద్ద పూజారులు హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు సాయంత్రం కుంకుమార్చన దీపారాధన, దాన్యాదివాసం, నిర్వహించారు కంతమహేశ్వర స్వామి సురమాంబ రేణుక ఎల్లమ్మ, వనమైసమ్మ, విగ్రహాల కు పూజలు నిర్వహించి దాన్యోధి వాసం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బత్తిని సాయన్న బొంగు సిద్దయ్య బుసనబోయిన సమ్మయ్య బొబ్బిలి రమేష్, కమిటీ సభ్యులు బత్తిని రమేష్ తీగల ముఖేష్ గుండెబోయిన లక్ష్మీనారాయణ యాసారపు సురేష్ యాసారపు యాకయ్య మాచర్ల వంశీ మాచర్ల రంజిత్ యాసారపు తిరుపతి బొబ్బిలి శ్రవణ్, మొక్క నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జన గణనపై అవగాహన



**ఇల్లందు, మే 12, ప్రజా జ్యోతి:** జన గణన అనేది దేశ అభివృద్ధికి ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని, ప్రజల సంఖ్య, విద్య ఉపాధి నివాస పరిస్థితి వంటి వివరాలను సేకరించడం ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ అన్నారు. మంగళవారం జనగణన సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 11 నుండి జూన్ 9 వరకు జనగణన సర్వే జరుగుతుందన్నారు. 22వ వార్డును జన గణనలో మూడు బ్లాకులుగా విభజించి, రోడ్డు మ్యాపులను ఏనుమేలేటర్, వార్డ్ ఆఫీసర్ లకు చూపించడం జరిగిందని తెలిపారు. ప్రతి కుటుంబం సరైన సమాచారాన్ని అందించడం వలన ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేకూరుతాయని తెలిపారు. జనగణన సమయంలో ప్రజలు సహకరించాల్సిన విధానాన్ని ఇంటింటికి వచ్చే సిబ్బందికి సరైన సమాచారం ఇవ్వాలని అలాగే దేశ అభివృద్ధికి ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమాలేటర్ బొర్ర తులసమ్మ, వార్డ్ ఆఫీసర్ రజిని తదితరులు పాల్గొన్నారు.

## సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి



**చర్ల, మే 12:(ప్రజా జ్యోతి):** చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మెయిన్ రోడ్డు సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పదవి నుంచి తొలగించాలని, ఆయన కుమారుడు సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ ప్రజలకు ఒక విధమైన న్యాయం అధికార పార్టీలకు చెందిన నాయకుల కుటుంబ సభ్యులకు మరో విధమైన న్యాయం అమలు అవుతోందా అని ప్రశ్నించారు.ఒక మైనర్ బాలిక మూడు నెలలుగా న్యాయం కోసం పోరాడాల్సి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. బాధితురాలు ఆమె కుటుంబ సభ్యులను నేరస్థుల మాదిరిగా వేధించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. బాలిక అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ వెంటనే స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. "బేటీ బచావో – బేటీ పడావో" అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసే బీజేపీ నాయకత్వం, ఇప్పుడు కేంద్ర సహాయ మంత్రి కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తోందని ప్ర శ్నించారు. చట్టం ముందు అందరూ సమానమే అయితే వెంటనే నిష్పక్షపాత ద ర్యాప్తు జరిపి సాయి భగీరథ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం బీ ఆర్ఎస్ నాయకులు చర్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ డి అజీజ్, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, కొంబత్తిని రాంబాబు, అంబోజి సతీష్, తోటపల్లి మాధవరావు, సం తపురి సతీష్, కారం కన్నారావు, గోరింట్ల వెంకటేశ్వర్లు, మహిళ సీనియర్ నాయకురాలు బేతంచర్ల నర్స వేణి, ఉప సర్పంచులు ఎడ్ల రామదాసు, కొప్పుల సత్యనారాయణ, వార్డు నెంబర్ కట్టం కన్నారావు, కుక్కదపు సాయి, పాసిగంటి సంతోష్, అలవాల కృష్ణ, కనుక వీరభద్రం, వంకాయల వినోద్ కుమార్, శ్యామల సాంబశివరావు తడికల వెంకటేశ్వర్లు, కొంగురీ నరసింహారావు నాయకులు పాల్గొన్నారు.

## బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన భగీరథ్‌ను కఠినంగా శిక్షించాలి

- కేసును నీరుగార్చే ప్రయత్నాలు మానుకోవాలి : ఎన్ఎఫ్ఐడబ్ల్యూ

**కొత్తగూడెం, మే 12 ( ప్రజాజ్యోతి )** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) డిమాండ్ చేసింది. బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి మాట్లాడుతూ అధికార బలంతో మైనర్ బాలికల జీవితాలతో ఆడుకోవడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడని చట్టం ఒకలాగా , సాధారణ ప్రజలకు మరొకలాగ అనే పరిస్థితి ఉండకూడదన్నారు. కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరిగితే మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాయని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని నిర్భయ వంటి కఠిన చట్టాలు ఉన్నప్పటికీ మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేసి బాధితులకు వేగంగా న్యాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అధికార అహంకారంతో మహిళలపై దాడులు చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. మహిళల రక్షణపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రత్న కుమారి, షేక్ షాహిన్, కైసార్, పోలుమోరి ధనలక్ష్మి, మునిగడప పద్మ, గోనె మని, మంద నిర్మల, గాయిత్రి, శాంతి, బుజ్జమ్మ, సునీత, లత, మద్దెనేని నాగమణి, దార్ల లక్ష్మి, సరోజ, రమ పాల్గొన్నారు.




# నరేంద్ర మోడీ ఫాసిస్టు పాలనలో దినదిన గండంగా రైతుల బ్రతుకులు






**ఇల్లందు, మే 12, ప్రజాజ్యోతి:** నరేంద్ర మోడీ ఫాసిస్టు పాలనలో దినదిన గండంగా రైతుల బ్రతుకులు మారిపోతున్నాయని మాజీ ఎంపీ వద్దే శోభనాదీశ్వరరావు ఆరోపించారు. మంగళవారం అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ వ్యవస్థాపక సభలను ఏర్పాటు చేసిన అయితా ఫంక్షన్ హాల్ లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలను నిర్వీర్యపరిచి దేశాన్ని దోచుకునే కార్పొరేట్ శక్తుల పక్షాన కేంద్ర ప్రభుత్వం పని పనిచేస్తుందని విమర్శించారు. పారిశ్రామిక ఉత్పత్తులకు ధరలు నిర్ణయించినట్లుగానే వ్యవసాయ ఉత్పత్తులకు కూడా సమగ్ర ఉత్పత్తి ఖర్చుల ప్రాతిపదిక ప్రకారం ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. దేశంలో 2014 సంవత్సరం ముందు నాలుగు లక్షల మంది రైతులు వ్యవసాయంలో నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడినారని, ఆ తర్వాత లక్ష 30 వేలమంది బలవన్మరణాలకు పాల్పడినప్పటికి మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం రైతుల మేలు కోరి చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మోడీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్లకు రూ. 16 లక్షల కోట్ల రుణమాఫీ చేసిందని, రూ. 80 వేల కోట్లు ఉద్దేశపూర్వకంగా బ్యాంకు లోన్లు ఎగొట్టిన గుత్త పెట్టుబడిదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనిల్ అంబానీ లాంటివాళ్ళు ఆకోవలోకే వస్తారని గుర్తు చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలకై వ్యవసాయ రంగ రక్షణ కొరకు రైతులు దేశంలో పోరాడుతున్నారని తెలిపారు. రైతులను అణచివేసే విధానాల్లో భాగంగానే విభజించు.. పాలించనే పద్ధతుల్లో మత విభజనకు మోడీ పాల్పడుతున్నారని ఆరోపించారు. బిజెపి లాంటి పార్టీలు దేశ ప్రగతికి వ్యతిరేకమని, దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ హక్కులకు కూడా వ్యతిరేకమని విమర్శించారు. ప్రజాపాలనకు బదులు మనుధర్మ సూత్రాల అమలును వారు ప్రాధాన్యతగా పెట్టుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు బిజెపికి 2/3 మెజారిటీ రాలేదని 2029లో అధికారంలోకి వస్తే దేశంలోని ప్రజాస్వామ్యం సిగ్గుతో తల ఒంచుకోక తప్పదన్నారు. వ్యవసాయం చేసే రైతులు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాము, కేచ్చేల రంగారెడ్డి, ప్రదీప్ సింగ్ ఠాగూర్, హర్నీక్ సీంగ్ మహిమ్, శశికాంత్, ఉమాకాంత్, పి రామకృష్ణ, మనోహర్ రాజు, శిరోమణి, కాంపాటి పృథ్వీ, అజ్మీర బిచ్చ, పి రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల సంరక్షణపై కేంద్ర హోమ్ శాఖ సహాయక మంత్రి సమాధానం చెప్పాలి



**ఇల్లందు, మే 12, ప్రజాజ్యోతి:** మహిళల సంరక్షణ పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని, బండి సాయి భగీరథ పై ప్రభుత్వానికి ఎందుకంత ఉదాసీనతో తెలపాలని బిఆర్ఎస్ నాయకులు చిలువేరు సత్యనారాయణ, సూర్ణపాక సత్యనారాయణ, దాస్యం ప్రమోద్ కుమార్, నెమలి ధనలక్ష్మి లు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఒక మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన వ్యక్తి పై ఫోక్సొ చట్టం కింద కేసు నమోదు చేసి తక్షణమే రిమాండ్ కు తరలించాల్సి ఉండగా, ఆ కేసు నుండి అతనిని తప్పించేందుకు హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వంతో అంతర్గతంగా చర్చలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా హోం శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి మహిళల సంరక్షణ శాంతి భద్రతల పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని పరిపాలిస్తున్న బిజెపి మహిళా సంరక్షణపై బండి సంజయ్ కుమారుడు చేసిన ఈ అసభ్యకరమైన పనిపై సమాధానం చెప్పాలన్నారు. దేశ రక్షణ మహిళా సంరక్షణ కోసం పాటుపడాల్సిన హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆయన కుమారుడే మైనర్ బాలికల పట్ల ఇలా అసభ్యకరంగా ప్రవర్తించిన విధానానికి మంత్రి బండి సంజయ్ తో పాటు బిజెపి కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళ బిజెపి ఎంపీగా ఉన్న డీకే అరుణ, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, రాష్ట్రంలో కొనసాగుతున్న మహిళా మంత్రులు మైనర్ బాలికపై జరిగిన అకృత్యానికి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఇప్పటివరకు జరిగిన సంఘటనపై నోరు మెదపకపోవడంపై వారికి బిజెపికి ఉన్న అంతర్గత సంబంధాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడో జరిగే సంఘటనపై స్పందించే కమ్యూనిస్టు మహిళా సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు బండి సంజయ్ కుమారుడు చేసిన ఈ అసభ్యకరమైన పనిని ఎందుకు ఖండించడం లేదని, ఎందుకు రోడ్లెక్కి ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయట్లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని తక్షణమే నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు అజ్మీర బావు సింగ్, వీరభద్రం, హరిప్రసాద్, గిన్నారపు రాజేష్, వేమురు సుజాత, సంతోషి పాసి, సుజాత, భవాని, మీర్జా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సింగ్ డే వేడుకలు







**ఇల్లందు, మే 12, ప్రజాజ్యోతి:** అంతర్జాతీయ నర్సింగ్ డే వేడుకలను మంగళవారం ఇల్లందు ఏరియా హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రపంచ సేవా మూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని ప్రతి ఏటా నర్సింగ్ డే గా జరుపుకుంటారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది వారి గొప్పతనం, ఆమె సేవా భావం, నర్సింగ్ రంగానికి చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా ఒక నర్సింగ్ సిస్టర్ ఫ్లోరెన్స్ నైటింగేల్ వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం పలువురు హెడ్ నర్సులు, నర్సింగ్ ఆఫీసర్లను వైద్యుల బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ ఫర్జానా, హెడ్ నర్సులు, నర్సింగ్ ఆఫీసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

# ఖాకీ హోదా పక్కనపెట్టి.. ఆటోలో వచ్చిన సీఐ

- ట్రాఫిక్ రద్దీలో ఆటోలో వెళ్లి విధులు నిర్వహించిన సీఐ ఇంద్రసేనారెడ్డి
- ట్రాఫిక్ నియంత్రణకు సామాన్యుడి బైక్‌పై దూసుకెళ్లిన మహిళ ఎస్సై విజయ
- హనుమాన్ జయంతి శోభాయాత్రలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు





**కొత్తగూడెం, మే 12 (ప్రజాజ్యోతి)** హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో వానర సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ శోభాయాత్ర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా సాగింది. పట్టణంలోని ప్రధాన రహదారిలో జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగగా వేలాది మంది భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు. భారీగా నడిచిన జనసందోహంతో వాహనాల రద్దీ అధికంగా నెలకొన్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ క్రమంలో కొత్తగూడెం మూడో పట్టణ సీఐ ఇంద్రసేనారెడ్డి తన బాధ్యతాయుత వైఖరితో అందరి ప్రశంసలు అందుకున్నారు. ట్రాఫిక్ అధికంగా ఉండటంతో పోలీసు అధికార వాహనం సూపర్ బజారు సెంటర్ వరకు చేరే పరిస్థితి లేకపోవడంతో ఆలస్యం చేయకుండా సామాన్యుడిలా ఆటో ఎక్కి అక్కడికి చేరుకున్నారు. విధి నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ హోదాను పక్కనపెట్టి ఆటోలో రావడం అక్కడున్న ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ఎక్కడా నిలిచిపోకుండా మూడో పట్టణ సీఐ ఇంద్రసేనారెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించారు. ముఖ్య కూడళ్ల వద్ద పోలీసు సిబ్బందికి ఆదేశాలు ఇస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను మళ్లించడం, అత్యవసర వాహనాలకు దారి కల్పించడం వంటి చర్యలు చేపట్టారు. అలాగే ఒకటో పట్టణ మహిళ ఎస్సై విజయ కూడా విధి నిర్వహణలో ప్రత్యేక చొరవ చూపారు. ట్రాఫిక్ తీవ్రంగా ఉండటంతో పోలీసు వాహనం ముందుకు సాగలేని పరిస్థితుల్లో అటుగా వెళ్తున్న ఒక సామాన్యుడి బైక్‌పై సూపర్ బజారు నుంచి గణేష్ టెంపుల్ వెల్లు మార్గంలో వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి హం గూ ఆర్భాటాలు లేకుండా సాధారణ ప్రజల మాదిరిగా మహిళ ఎస్సై విజయ సామాన్యుడి బైక్‌పై వెళ్లి విధులు నిర్వహించడం స్థానిక ప్రజలను ఆకట్టుకుంది. బాధ్యత పట్ల ఆమె చూపిన అంకితభావాన్ని పలువురు అభినందించారు. మూడోవ పట్టణ సీఐ ఆదేశాల మేరకు ఎస్సై విజయ కుమారి తన సిబ్బందితో కలిసి సూపర్ బజారు సెంటర్ లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. శోభాయాత్ర మార్గంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తూ భక్తులు సురక్షితంగా కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ రద్దీ మధ్య అధికార వాహనాలను పక్కనబెట్టి ఆటో, బైక్‌లపై వెళ్లి విధులు నిర్వహించిన పోలీసు అధికారుల తీరు స్థానిక ప్రజలు, భక్తుల ప్రశంసలు అందుకుంది. హోదా కంటే బాధ్యతే ముఖ్యం అని పోలీసు అధికారులు మరోసారి చాటి చెప్పారని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

## దమ్మపేటలో సోయం గంగులు 74వ వర్ధంతి ఘనంగా

- సోయం గంగులు ఆశయాలు స్ఫూర్తిదాయకం: తాటి వెంకటేశ్వర్లు



**దమ్మపేట, మే 12 (ప్రజాజ్యోతి):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కోయ బెబ్బులిగా పేరొందిన సోయం గంగులు 74వ వర్ధంతిని దమ్మపేట మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పాల్గొని సోయం గంగులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, జమేదారు బంజర గ్రామానికి చెందిన సోయం గంగులు దళ కమాం డర్‌గా పనిచేస్తూ రజాకార్లు, నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. 1948లో పోలీస్ కాల్పుల్లో అమరుడయ్యారని చెప్పారు. కోయ భాషలో "దూ" అంటే పెద్దపులి అని, ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన ధైర్యవంతుడైన నాయకుడిగా గంగులు నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో సోయం వీరభద్రం, దొడ్డా రమేష్, శ్రీను, గాజుబోయిన ఏసుబాబు, ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేటీపీఎస్ 9వ యూనిట్ వంద రోజులు నిరంతరాయంగా నడిచిన సందర్భంగా అభినందన సభ

- ఉద్యోగులు, ఇంజనీర్లను అభినందించిన సీఈ ఎం. ప్రభాకర్ రావు



**పాల్వంచ, మే 12, ప్రజాజ్యోతి:** కేటీపీఎస్ 5వ మరియు 6వ దశల పరిధిలోని 9వ యూనిట్ నిరంతరాయంగా వంద రోజులు విజయవంతంగా పనిచేసిన సందర్భంగా శనివారం 5వ దశ యూసీబీలో అభినందన సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఈ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, 9వ యూనిట్ ఎలాంటి అంతరాయాలు లేకుండా వంద రోజులు నిరంతరాయంగా నడవడం గర్వకారణమన్నారు. ఈ విజయానికి కృషి చేసిన 5వ దశ ఉద్యోగులు, ఆర్టిసన్స్, ఇంజనీర్లు అందరినీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే భవిష్యత్తులో కూడా 5వ మరియు 6వ దశలలోని అన్ని యూనిట్లు సజావుగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా నడిచేలా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ (5వ దశ) శ్రీ సత్యనారాయణ కేక్ కట్ చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగులు, ఆర్టిసన్స్, ఇంజనీర్లు పరస్పరం ఒకరినొకరు అభినందించుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్లు బి. శివరామిరెడ్డి, జీవీ ధర్మారావు, పి. కృష్ణ, డిప్యూటీ సీసీఏ రామారావు, సీనియర్ ఇంజనీర్లు, ఇంజనీర్లు, ఉద్యోగులు, ఆర్టిసన్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

- బాధిత బాలికకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నిరసన



**ములకలపల్లి, మే 12, ప్రజాజ్యోతి:** పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథపై మైనర్ బాలికపై అత్యాచారం ఘటనకు సంబంధించి పోక్సో కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బాధిత మైనర్ బాలికకు వెంటనే న్యాయం చేయాలని, బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి పదవి నుంచి బండి సంజయ్ కుమార్ ను సస్పెండ్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కేసు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శనగపాటి సీతారాములు, మట్ల నాగమణి, బండి కొమరయ్య, పుష్పాల చందర్ రావు, బైటి రాజేష్, సూరం పుల్లారావు, సర్పంచులు తుర్రం శ్రీను, భూక్యా ధర్మ, గడ్డం సుజాత, పూరేటి నర్సింహారావు, ఆదిమూలం యాదగిరి, గడ్డం బాబురావు, గడ్డం ఉదయ్, తమ్మిశెట్టి శ్రీను, కందుకూరి సత్యనారాయణ, ఊరపెద్ది వెంకన్న, మీడియం బాబురావు, బొర్రా సుధాకర్, కుంజా సూర్యనారాయణ, ఇర్పా ప్రసాద్, పుప్పాల గోపి, రవ్వ నరేష్, జైభీమ్ నర్సింహా, వేముల సతీష్, తాళ్ల శ్రీను, కాంపాటి షోందు, ఊకె అశోక్, గుగులోత్ వీరన్న పాల్గొన్నారు.

## తుమ్మల రాజకీయ ప్రస్థానానికి 40 వసంతాలు

- దమ్మపేట మసీదు కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు



**దమ్మపేట, మే 12 (ప్రజాజ్యోతి):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితంలో 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దమ్మపేట మసీదు కాంప్లెక్స్‌లో మసీదు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 1986 మే 14న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మంత్రివర్గంలో తొలిసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తుమ్మల నాగేశ్వరరావు ప్రజా సేవలో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. దమ్మపేటలో షాదీఖానా, ఖబరస్తాన్ కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించి ముస్లింలకు అండగా నిలిచిన తుమ్మల నాగేశ్వరరావు సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. మసీదు కమిటీ సభ్యులు కేక్ కట్ చేసి మంత్రి తుమ్మల ఆయురారోగ్యాలతో ఉండాలని, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, కొయ్యల అచ్యుతరావు కార్యక్రమంలో పాల్గొని తుమ్మల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దమ్మపేట మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, మైనార్టీ నాయకులు ఎండీ వలీ పాషా, పాత్రికేయులు ఎస్కే దస్తగిరి, షేక్ అబ్దుల్ గౌస్, ఇమ్రాన్, మహమ్మద్ సాలార్ తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి

- భగీరథను వెంటనే అరెస్టు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- మందలపల్లిలో బీఆర్ఎస్ ధర్నా



**దమ్మపేట,(ప్రజాజ్యోతి) మే 12:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై నమోదైన పోక్సో కేసులో వెంటనే అరెస్టు చేయాలని, బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మందలపల్లి క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ మాట్లాడుతూ, మైనర్ బాలికపై అత్యాచారం జరిగిందనే ఆరోపణలపై పోక్సో కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బాధిత కుటుంబం మూడు నెలలుగా పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వచ్చిందని ఆరోపించారు. సాధారణ ప్రజలపై వేగంగా చర్యలు తీసుకునే పోలీసులు, అధికార పార్టీల నేతల కుటుంబాల విషయంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. "బేటీ బచావో" నినాదం కేవలం ప్రచారానికే పరిమితమైందా అని ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం చేయాల్సిన ప్రభుత్వం, బాధిత కుటుంబంపైనే రివర్స్ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. బాధిత మైనర్ బాలికకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీఆర్ఎస్ నాయకులు సోయ్యం వీరభద్రం, రావుల శ్రీనివాసరావు, యాట్ల రామదాసు, దారా రాము, గాజుబోయిన ఏసుబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, మండవ సత్య, అబ్దుల్ జిన్నా, చీకటి రామయ్య, రావూరి వీరయ్య, వెలుగోటి మహేష్, తాళ్ల వెంకటేశ్వరావు, వల్లెపు నాగేశ్వరావు, కొండ్రముచ్చు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రక్షణ కల్పించి న్యాయం చేయాలి
- బిఆర్ఎస్ మండల నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్



**టేకులపల్లి,మే12,ప్రజాజ్యోతి:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ పై ఫోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని కేసుని నీరు కార్చేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులపై విచారణ జరపాలని బిఆర్ఎస్ మండల నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.కేంద్ర మంత్రి కుమారుడిపై వచ్చిన పోక్సో కేసులో నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మంత్రి కుమారుడు మైనర్ బాలికపై అకృత్యానికి పాల్పడినట్లు బాధితులు ఫిర్యాదు చేసినా విషయం అందరికి తెలిసినదే అన్నారు. ప్రభుత్వం కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటు అని ఆరోపించారు.సీఎం రేవంత్ రెడ్డి ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని వారు అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ సామాన్యులకు ఒక నీతి, రాజకీయ నేతలకు ఒక నీతి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిందితుడికి శిక్ష పడేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్యా దల్ సింగ్ నాయక్ సర్పంచులు బర్మావత్ శివకృష్ణ, లకావత్ నాకా నాయక్, బిఆర్ఎస్ మండల నాయకులు లక్కినేని సురేందర్ రావు, ఆంగోత్ లక్పతి, తేజావత్ రవి, బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు ఆమెడా రేణుక,బానోత్ రామ నాయక్, జాలాది అప్పారావు, భూక్యా లాలు నాయక్,నాగభూషణం పాల్గొన్నారు.

# మారుమూల గ్రామాలకు "పల్లెవెలుగు "

- గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తాం
- నియోజకవర్గ కేంద్రంలో మినీ బస్ డిపో, "ఈవీ "బస్సులు... జారే ఆదినారాయణ...అశ్వారావుపేట ఎమ్మెల్యే
- అశ్వారావుపేట నుండి కొత్తగూడెం వయా తిరుమల కుంట బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే జారే





**అశ్వారావుపేట, మే 12, ప్రజాజ్యోతి :** మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రతి గ్రామానికి "పల్లెవెలుగు" బస్సు సేవలను విస్తరించేలా కృషి చేస్తున్నామన్నారు. మంగళవారం అశ్వారావుపేట నుండి కొత్తగూడెం వరకు వయా తిరుమలకుంట కొత్త బస్సు సేవలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అశ్వారావుపేట బస్ స్టాండ్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త బస్సు మార్గాలను ఏర్పాటు చేస్తున్నామని, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు సౌకర్యవంతంగా ప్రయాణించేలా రవాణా సదుపాయాలు కల్పిస్తున్నమన్నారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం గ్రామీణ ప్రాంతాలలోని మహిళ కూడా అందాలని మారుమూల ఏజెన్సీ గ్రామాలకు సైతం బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో మినీ బస్ డిపో ఏర్పాటు చేయడంతో అదనంగా మరికొన్ని బస్ సర్వీసులు పెరుగుతాయని తద్వారా గ్రామీణ ప్రాంతాలలో రవాణా వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు తక్కువ వ్యయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా త్వరలోనే ఈవీ బస్సులను అందుబాటులోకి తీసుకురానామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ లు మిండా హరి బాబు,కట్టా సింధుజ,రవి,కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ దీపక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జూపల్లి ప్రమోద్, కేదార్ నాథ్, నండ్రు రమేష్, కానూరి మోహన్ రావు, అల్లాడి వేంకట రామారావు, కర్నాటి శ్రీనివాసరావు, కాసాని పద్మ శేఖర్, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు

- రామాలయంలో వైభవంగా అభయాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు
- బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం







**అన్నపురెడ్డిపల్లి, మే 12, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన సన్నిధానంలో ఆలయ క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న శ్రీ ఆంజనేయ స్వామి వారి హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆదేశానుసారం ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, ఆకు పూజ, సహస్రనామార్చనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి ప్రసాదాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి నామాలను పఠించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలను తోరణాలతో అలంకరించి పారాయణాలు, పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆంజనేయ స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రెండు ఆలయాల్లోనూ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. వేడుకల్లో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు మరియు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. అలాగే అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా ఉన్న రామాలయాల్లో హనుమాన్ భక్తులు ఆంజనేయస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు కూడా చేపట్టారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన అనూషకు ధ్రువపత్రం అందజేత

**పాల్వంచ, మే 12, ప్రజాజ్యోతి:** ఫిబ్రవరి 2న గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సామూహిక కీబోర్డ్ కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన 2000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంట సేపు నిరంతరాయంగా కీబోర్డ్ వాయించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 777 మంది విద్యార్థులకు గిన్నిస్ వరల్డ్ రికార్డు పుస్తకంలో స్థానం లభించింది. ఈ క్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు గిన్నిస్ వరల్డ్ రికార్డు ధ్రువపత్రాలను అందజేశారు. పాల్వంచ పట్టణానికి చెందిన కండేల్ నతానియేల్ కుమార్తె అనూష హల్లెల్ మ్యూజిక్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ చేతుల మీదుగా మంగళవారం గిన్నిస్ వరల్డ్ రికార్డు ధ్రువపత్రాన్ని అందుకున్నారు.



# హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాల్లో పూజలు చేసిన కొత్వాల దంపతులు

**పాల్వంచ, మే 12, ప్రజాజ్యోతి:** హనుమాన్ జయంతి సందర్భంగా హనుమంతునికి ప్రీతిపాత్రమైన మంగళవారం పలు దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని పాత పాల్వంచ ఆంజనేయస్వామి దేవాలయం, బొల్లోరిగూడెం రామాలయం, అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలోని హనుమాన్ గుడిలో జరిగిన పూజా కార్యక్రమాల్లో కొత్వాల దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల నిర్వాహకులు వారిని శాలువాలతో సత్కరించారు. అలాగే హనుమాన్ జయంతి సందర్భంగా అయ్యప్పస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సుమారు వెయ్యి మంది భక్తుల అన్నదాన కార్యక్రమాన్ని కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, సీరపు సుగుణ, అయ్యప్పస్వామి దేవాలయం పూజారి బృందావనం నరసింహమూర్తి, కనగాల రాంబాబు, బేతంశెట్టి వెంకట్, భట్టు మంజుల, బ్యాంకు చారి, కేశబోయిన కోటేశ్వరరావు, బాడిశ శంకరరావు, గల్ల శోభన్‌బాబు, హర్షవర్ధన్, సుంకర వీరభద్రం, కృష్ణ, ప్రసాద్, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## శ్రీనివాసగిరి గుట్టపై ఘనంగా అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు

**పాల్వంచ, మే 12, ప్రజాజ్యోతి:** శ్రీనివాస కాలనీ శ్రీనివాసగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం (గుట్ట) ఆవరణలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, అర్చకులు ఆరుట్ల పనిరాజాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, హోమం నిర్వహించి, అనంతరం జయంతి వేడుకలకు హాజరైన భక్తులతో తమలపాకులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఉదయం 7 గంటల నుంచి భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠనం భక్తిశ్రద్ధలతో సాగింది. అనంతరం హాజరైన భక్తులందరికీ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసగిరి భక్త సమాజ మండలి అధ్యక్షులు ఊకే భద్రయ్య, ఉపాధ్యక్షులు చనుమోలు శ్రీనివాసరావు, కోశాధికారి పిట్ట లక్ష్మారెడ్డి, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి బండ్లముడి విజయలక్ష్మి , సేవాదళ్ అధ్యక్షులు కొండ్రు శివ, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టుకు ఉద్యోగావకాశాలు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**పాల్వంచ, మే 12, ప్రజాజ్యోతి:** పాల్వంచలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత ప్రభుత్వ న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహకారంతో నిర్వహించబడుతున్న పరిశోధన ప్రాజెక్టుకు రీసెర్చ్ అసోసియేట్, రీసెర్చ్ అసిస్టెంట్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ మరియు ప్రాజెక్ట్ ప్రధాన పరిశోధకురాలు డాక్టర్ టి. అరుణ కుమారి తెలిపారు. గిరిజన విద్యార్థుల్లో హిందీ భాషా అభ్యాసంలో సవాళ్లు మరియు పరిష్కారాలు, బహుభాషా మరియు సామాజిక–సాంస్కృతిక విశ్లేషణ అనే అంశంపై ఈ పరిశోధన ప్రాజెక్టు చేపట్టబడుతున్నట్లు వారు పేర్కొన్నారు. రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు నెలకు రూ.47,000 వేతనం, మూడు నెలల కాలపరిమితి ఉండగా, రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.37,000 వేతనం, రెండు నెలల కాలపరిమితి ఉంటుందని తెలిపారు. అలాగే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ పోస్టుకు నెలకు రూ.20,000 వేతనం, నాలుగు నెలల కాలపరిమితి ఉంటుందని వెల్లడించారు. సామాజిక శాస్త్ర విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రీసెర్చ్ అసోసియేట్ మరియు రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు నెట్, ఎం.ఫిల్, పీహెచ్‌డీ అర్హతలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, విద్యార్హతలు మరియు అనుభవ పత్రాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచలో నిర్వహించబడతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు హిందీ విభాగానికి చెందిన డాక్టర్ టి. అరుణ కుమారిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఇవి శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు చేసే పోస్టులు కాదని, కేవలం కాలపరిమితి కలిగిన పోస్టులేనని స్పష్టం చేశారు. అలాగే ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి టీఏ, డీఏలు చెల్లించబడవని తెలిపారు.




## మొక్కజొన్నలు కొనుగోలు పై జాప్యం ఉండకూడదు

- పిఎసిఎస్ చైర్మన్ కి బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో వినతి



**టేకులపల్లి,మే12,ప్రజాజ్యోతి:** ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు వర ప్రసాద్ డిమాండ్ చేశారు. మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని మంగళవారం బి ఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను రైతులకు తక్షణమే ఖాతాలలో జమ చేయాలి అని డిమాండ్ చేశారు.మొక్కజొన్న కొనుగోలుపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా టేకులపల్లి బేతంపూడి పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్రావు, సీఈఓ ప్రేమచారి కి బిఆర్ఎస్ నాయకులు వినతి అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచులు బర్మావత్ శివకృష్ణ,లకావత్ నాకా నాయక్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్యా దల్సింగ్ నాయక్, భూక్యా లాలూ నాయక్, తేజావత్ రవి నాయక్, ఆంగోత్ లక్పతి, బానోత్ రామా నాయక్ , జాలాది అప్పారావు,బానోత్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామానుజన్ టాలెంట్ టెస్ట్‌లో త్రివేణి విద్యార్థుల ప్రతిభ



**లక్ష్మీదేవిపల్లి, మే 12 (ప్రజాజ్యోతి)** శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 15న నిర్వహించిన రామానుజన్ టాలెంట్ టెస్ట్ ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. లక్ష్మీ దేవిపల్లి మండలం పరిధిలో గల త్రివేణి విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు వి. విహాన్ మరియు తస్విన్, కోమల్ శివ అచ్యుత్ ప్రైమరి లెవల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాలు దక్కించుకున్నారు. విద్యార్థుల ప్రతిభకు గాను శ్రీమాత రామానుజన్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రశంసలు తెలియజేశారు. త్రివేణి స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం పట్ల త్రివేణి – కృష్ణవేణి డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను త్రివేణి డైరెక్టర్ గోల్లపూడి వీరేంద్ర చౌదరి, సీఆర్వో మురళీకృష్ణ, ప్రైమరీ వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.